రైల్వే స్టేషన్‌లో సమస్యల కూత

- పనిచేయని డిస్‌ప్లే బోర్డులు
- 2, 3 ప్లాట్ ఫామ్‌లో ప్రయాణికులకు నీడ కరువు
- లిఫ్ట్ సిస్టమ్ లేక వృద్ధులు, వికలాంగులు తంటాలు


పనిచేయని డిస్‌ప్లే బోర్డు


ఆదోని రైల్వే స్టేషన్

ఆదోని సెంట్రల్: రైల్వే స్టేషన్‌లో సమస్యలు తిష్టవేసి ఉన్నాయి. ప్రయాణికులకు రైల్వే సమాచారం చూపించాల్సిన బోర్డులు పని చేయడం లేదు. రైలు వచ్చినా ఏ బోగి ఎక్కడ ఆగుతుందో కూడా తెలియనటువంటి పరిస్థితి. దీంతో సరైన సమాచారం తెలియక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఆదోని రైల్వే స్టేషన్ మీదుగా బెంగళూరు, తిరుపతి, ముంబయి, హైదరాబాద్‌వంటి ప్రధాన నగరాలకు రోజు 21 రైళ్ల రాక పోకలు సాగిస్తున్నాయి. దాదాపు ప్రతి రోజు 2,000 మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు ఆదోని పట్టణం నుంచే ప్రయాణం చేస్తూ ఉంటారు. రోజుకు 6 నుంచి 8 గూడ్స్ బండ్లు ఆదోని మీదుగా వెళ్తున్నాయి. ఇంతటి ప్రాధాన్యత ఉన్న రైల్వే స్టేషన్‌లో సమస్యలు తిష్ట వేశాయి. 2, 3, 4 ప్లాట్ ఫామ్‌కు వెళ్లాలంటే మెట్ల మార్గమే గతి. వృద్ధులు, చంటిపిల్లలు, అంగవైకల్యం కలిగిన వారు మెట్ల మార్గం గుండా వెళ్లాలంటే తల ప్రాణం తోకకొస్తోంది. ఇక రైలు వస్తున్నట్లు సిగ్నల్ ఇచ్చినప్పుడు వారు సమయానికి రైలును అందుకోవడం కష్టతరమే. 2, 3 ప్లాట్ ఫామ్‌లలో ప్రయాణికుల సౌకర్యార్థం రేకుల షెడ్డులను అరకొరగా ఏర్పాటు చేయడంతో వర్షం నీటిలో తడవాల్సిందే. ఎండ వేళల్లో ఎండ వేడికి తట్టు కోవాల్సిందే.

డిస్‌ప్లే బోర్డులు పనిచేయడం లేదు

ప్రయాణికుల సౌకర్యార్థం రైలు రాకపోకలను తెలియపరచడానికి ప్రభుత్వ డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేసింది. ఇవి నాలుగైదు రోజులుగా పని చేయడం లేదు. దీంతో ఏ రైలు ఎన్ని గంటలకు వస్తుందో సమాచారం తెలియక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రైలు వచ్చినప్పుడు కూడా ఏ బోగి ఎక్కడ ఆగుతుందో తెలపాల్సిన సిగ్నల్ బోర్డులు కూడా పని చేయడం లేదు. బోగీల సమాచారం చూపించాల్సిన బోర్డులు పనిచేయక పోవడం పట్ల ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.


పనిచేయని బోగి సిగ్నల్ బోర్డులు

లిఫ్ట్ సిస్టం ఏర్పాటు చేయాలి



ఒక ప్లాట్ ఫామ్ నుంచి మరో ప్లాట్ ఫామ్‌కు మెట్ల మార్గంలో వెళ్లాలంటే మాలాంటి వృద్ధులకు ఇబ్బందిగా ఉంది. అంగవైకల్యం, చంటి పిల్లలు కలిగిన వారు వెళా వెళ్తారు. పభుత్వం మాలాంటి వారిని దృష్టిలో ఉంచుకొని లిఫ్ట్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. 2, 3 ప్లాట్ ఫామ్‌లో కూడా సరైన వసతి సౌకర్యాలు లేవు. వాటిని కూడా ఏర్పాటు చేయాలి. రైళ్ల రాకపోకల సమాచారం అందించే డిస్‌ప్లే బోర్డులు కూడా పని చేయడం లేదు.

– కె.సరవేశ్వరగుప్త, ప్రయాణికుడు, ఆదోని

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



రైళ్ల రాక పోకల సమాచారం అందించే డిస్‌ప్లే బోర్డులు పని చేయడం లేదని విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం టెక్నికల్ ప్రాబ్లం కనుక డిస్‌ప్లే బోర్డుకు సంబంధించిన కంపెనీ వారు వచ్చి రిపేరు చేయాల్సి ఉంది. 2, 3 ప్లాట్ ఫామ్‌కు రేకుల షెడ్డు, లిఫ్ట్ సిస్టం వంటి సౌకర్యాలను కల్పించడానికి ప్రభుత్వం అమృత ప్రాజెక్టు కింద నిధులను మంజూరు చేసింది. వాటి పనులను త్వరగా చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా అన్నిసౌకర్యాలను కల్పించేందుకు చర్యలు చేపడుతున్నాం.

– వెంకటేశులు, స్టేషన్ మాస్టర్, ఆదోని

క్లుప్తంగా

త్రీటౌన్ ఎస్‌ఐగా విజయలక్ష్మి



ఆదోనిఅర్బన్: త్రీటౌన్ ఎస్‌ఐగా విజయలక్ష్మి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇన్చీ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న ఆమెను ఉన్నతాధికారులు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేయడంతో ఆమె బాధ్యలు స్వీకరించారు.

మౌలిక వసతులు కల్పించాలి


నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కామాక్షి వెంకట్ కోరారు. శుక్రవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలో కళాశాలల బంద్ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో అధిక ఫీజును ప్రభుత్వం నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు లక్ష్మీనారాయణ, సురేంద్రబాబు, వివేక్, అరవింద్, నరేంద్ర, సంతోష్, భూషణ్, నూర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

క్విట్ మోదీ-సేవ్ ఇండియా


మాట్లాడుతున్న నాయకులు

ఆదోని రూరల్: ఆగస్టు 9న క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో క్విట్ మోదీ-సేవ్ ఇండియా నినాదంతో విజయవాడలో జరిగే మహా పడావో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబు, ఐఎన్‌టీయూసీ దేవిశెట్టి ప్రకాష్, తిప్పన్న, వెంకప్ప కోరారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో కేంద్ర కార్మిక సంఘాల సమావేశాన్ని సీఐటీయూ పట్టణ కార్యదర్శి పి.ఎస్.గోపాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం కార్మికులు, కర్షకుల పట్ల అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు వెంకన్న, భీమేష్, హుసేని, లక్ష్మన్న, నాగరాజు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన


డీఈఈ కార్యాలయం ముందు నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

ఆదోని అర్బన్: స్థానిక డీఈఈ కార్యాలయం ముందు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లు, ఉద్యోగులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకుడు, విద్యుత్‌శాఖ ఏడీఈ పురుషోత్తం మాట్లాడుతూ అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి, సమాన పనికి సమాన వేతనం అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఏకసభ్య కమిషన్ రద్దు చేసి పీఆర్‌సీ-2022ను అమలు చేయాలన్నారు. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో వెంటనే కొత్త పోస్టులు మంజూరు చేయాలన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి


ఓటరు జాబితాను పరిశీలిస్తున్న భీమిరెడ్డి

మంత్రాలయం రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని వైఎస్‌ఆర్‌సీ మండల కన్వీనర్ గుర్రెడ్డి భీమిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బసాపురం గ్రామంలో వీఆర్‌ఓ హరిత, బూత్ కన్వీనర్ నాగరాజులతో కలిసి ఓటరు జాబితాను పరిశీలించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి యువత ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటు విలువ తెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యుత్ బల్బులు ఏర్పాటు



కోసిగి: మండల పరిధిలోని మూగలదొడ్డి గ్రామంలో మొహర్రం వేడుకల సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా సర్పంచ్ శివలింగమ్మ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రాత్రిల్లో విద్యుత్ బల్బులు పోయిన చోట కొత్తగా ఎల్‌ఈడీ బల్బులను ఏర్పాటు చేయించారు. పారిశుద్ధ్యం లోపించకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉండేలా ఏర్పాట్లు చేశారు. గౌడుగల్లు గ్రామంలోనూ గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు మహాదేవా ఆధ్వర్యంలో విద్యుత్ బల్బులు ఏర్పాటు చేశారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించాలి

ఆదోని రూరల్: వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ఈరన్న, బాలస్వామి మాదిగ, జగన్ మాదిగ డిమాండ్ చేశారు. ఈనెల 31న ఆదోనిలో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప సన్నాహాక మహాసభకు సంబంధించిన కరపత్రాలను వారు శుక్రవారం మున్సిపల్ గ్రౌండ్‌లో ఆవిష్కరించారు. మహాసభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ హాజరవుతారన్నారు. మాదిగలు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు బండారి హనుమంతు, బాలన్న మాదిగ, వీరేష్ మాదిగ, కాలేబు మాదిగ పాల్గొన్నారు.

బంగారు దుకాణంలో చోరీ

ఆదోని అర్బన్: పట్టణంలోని బంగారు బజారులో ఉన్న ముఖేష్ జ్యువెలరీ దుకాణంలో చోరీ జరిగింది. షాపు యజమాని ముఖేష్ తెలిపిన వివరాలు.. గురువారం సాయంత్రం ఉంగరం కావాలని ఓ గుర్తు తెలియని వ్యక్తి దుకాణంలోకి వచ్చాడు. షాపులో లేకపోతే యజమాని పక్క షాపులో తెచ్చేందుకు వెళ్లగా ఇదే అదునుగా భావించిన దుండగుడు చెవికమ్మల పెట్టె తీసుకుని ఉడాయించాడు. అందులో 8 తులాల బంగారు చెవికమ్మలు ఉన్నాయని బాధితుడు శుక్రవారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

క్రికెట్ విజేత మూగలదొడ్డి


గెలుపొందిన జట్టుకు నగదు, కప్ అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కోసిగి: మండల పరిధిలోని మూగలదొడ్డి గ్రామంలో మొహర్రం పండుగను పురస్కరించుకుని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి సహకారంతో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో మూగలదొడ్డి జట్టు విజేతగా గెలిచింది. శుక్రవారం గ్రామంలో మూగలదొడ్డి, కామన్‌దొడ్డి జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా జరిగింది. ఇందులో కామన్‌దొడ్డి జట్టుపై మూగలదొడ్డి జట్టు విజేతగా నిలిచింది. పథమ బహుమతి మూగలదొడ్డి జట్టుకు గ్రామ సర్పంచ్ శివలింగమ్మ భర్త సోమేష్ రూ.15వేలు, ద్వితీయ బహుమతి కామన్ దొడ్డి జట్టుకు ఉప సర్పంచ్ రమేష్ రూ.10 వేల నగదులతో పాటు కపలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్స్ అశోక్, సురేష్, వైఎస్సార్ సీపీ నాయకులు రామిరెడ్డి, మల్లికార్జున, అంజినయ్య, ఉసేని, తిరుమల, తాయన్న, అయ్యప్ప, గిరీష్, గర్జప్ప పాల్గొన్నారు.

బృందావన ప్రతిమకు బంగారు పల్లకీ సేవ


బృందావన ప్రతిమను బంగారు పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో బృందావన ప్రతిమను బంగారు పల్లకీలో ఊరేగించారు. శుక్రవారం శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచి పీఠాధిపతి శ్రీ సుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో మూలబృందావనానికి నిర్మల్య విసర్జన, ఫల, పుష్ప, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుంచి తీసుకుని వచ్చిన ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. రాత్రి ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులను చెక్క, వెండి, బంగారు, నవరత్న రథోత్సవంపై ఉంచి శ్రీ మఠం మాఢ వీధుల్లో ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా తుంగభద్ర నదిలో పుణ్య స్నానమాచరించి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


మద్యం, నిందితుడిని చూపుతున్న పోలీసులు

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని ఆలూరు రోడ్డు మహాయోగి లక్ష్మమ్మవ్వ ఆర్చ్ వద్ద శుక్రవారం పోలీసులు కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. సీఐ శ్రీనివాసనాయక్ తెలిపిన వివరాలు.. మద్యం తరలుతోందనే సమాచారంతో పోలీసులు సోదాలు చేపట్టారు. బోయ జగ్గాపురం నాగరాజు స్కూటీపై కర్ణాటక మద్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి 12 బాక్సుల కర్ణాటక మద్యం, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు. సోదాల్లో ఎస్‌ఐ చంద్ర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

– ఆదోని రూరల్: మండలంలోని మదిరె గ్రామానికి చెందిన మహేష్ ఇంటి వద్ద కర్ణాటక టెట్రా ప్యాకెట్లను విక్రయిస్తుండగా పట్టుకొని, అతని వద్ద నుంచి 90 ఎం.ఎల్. పరిమాణం గల 70 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్చీ ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోండి


పెద్దభూంపల్లి గ్రామంలో ప్రజలు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ సీతారామయ్య

కోసిగి: మొహర్రం వేడుకులను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య సూచించారు. శుక్రవారం రాత్రి మండలంలోని చిన్న భూంపల్లి, పెద్దభూంపల్లి గ్రామాల్లో సీఐ ఎరిసా వలి, ఎస్‌ఐ సతీష్ కుమార్‌లతో కలిసి పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మొహర్రం వేడుకలు కలిసిమెలిసి చేసుకోవాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తినా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే మండలంలో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. మొహర్రం వేడుకల్లో అల్లర్లకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు.

ఘనంగా ఇమామ్ హుసేన్ సరిగెత్తు

మంత్రాలయం రూరల్: మొహర్రం సందర్భంగా మంత్రాలయం జమీయా మసీదు సమీపంలోని చావిడిలో కొలువైన పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఇమామ్‌హుసేన్ సరిగెత్తు కార్యక్రమాన్ని భక్తులు కులమతాలకు అతీతంగా జరుపుకున్నారు. తెల్లవారుజామున చావిడి నుంచి గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తూ తిరిగి పీర్ల చావిడికి చేర్చారు. రాత్రి అలాగుత్త వద్ద ఇమామ్ హుసేన్ సరిగెత్తు కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భక్తులు మొక్కుబడిగా చదివింపులు చేసుకున్నారు.

ఎస్కేడీ కాలనీలో పవర్ కట్

ఆదోనిఅర్బన్: పట్టణంలోని ఎస్కేడీ కాలనీలో 3 గంటలపాటు విద్యుత్‌కు అంతరాయం కలిగింది. సాయంత్రం 6:40 గంటలకు పవర్ కట్ చేయగా రాత్రి 9:45 గంటలకు పునరుద్ధరించారు. మూడు గంటలపాటు విద్యుత్ లేకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గాలి వల్ల విద్యుత్‌తీగల రాపిడి జరగడంతో పవర్ కట్ ఏర్పడిందని, మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించామని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు.

వివాహిత అదృశ్యం

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని రాఘవేంద్రపురం కాలనీకి చెందిన వివాహిత మాల పద్మ(29) అదృశ్యమైంది. ఎస్‌ఐ వేణుగోపాల్ తెలిపిన వివరాలు.. రాఘవేంద్రస్వామి మఠం ముందు రంగులు అద్దించుకునేందుకు గురువారం ఉదయం ఇంటి నుంచి వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో భర్త మాల మన్మథ తెలిసిన చోటల్లా వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాడు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

ఆదోనిఅర్బన్: మండలంలోని బల్లేకల్ గ్రామానికి చెందిన బజారమ్మ పురుగు మందు తాగి శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న బజారమ్మను వెంటనే బంధువులు ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

యువకుడికి గాయాలు

కోసిగి: మండల కేంద్రంలోని రైల్వే గేటు సమీపంలో బ్యాటరీల షాపు నిర్వహిస్తున్న యువకుడు ఈడిగ శివకుమార్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. శుక్రవారం ఆదోని వైపు నుంచి కోసిగికు బైక్‌పై వస్తుండగా పీకలబెట్ట బస్టాండ్ సమీపంలో బైక్ అదుపు తప్పి కిందకు పడిపోయాడు. తలకు తీవ్ర రక్త గాయం కావడంతో స్థానికులు గుర్తించి కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆదోని ఆసుపత్రికి తరలించారు.

అంబులెన్స్‌లో ప్రసవం

కోసిగి: మంత్రాలయం మండలం ఖగ్గల్ గ్రామానికి చెందిన శివరాజు భార్య జ్ఞానమ్మ ప్రసవం పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తీసుకొచ్చారు. హాస్పిటల్‌లో స్టాఫ్‌నర్స్ పరీక్షించారు. కాన్పు కావడం కష్టతరంగా ఉండడంతో 108 అంబులెన్స్‌లో ఆదోని ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో ఆడ బిడ్డను ప్రసవించింది. ఈఎంటీ రామకృష్ణ, పైలట్ జగదీష్‌లు తల్లీబిడ్డను ఆస్పత్రిలో చేర్పించి వైద్య సేవలు అందించారు.

ఓఆర్‌ఎస్‌పై అవగాహన

ఆదోనిఅర్బన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఓఆర్‌ఎస్‌పై ప్రయివేట్ ఆస్పత్రిలో డాక్టర్లు రఘునాథ్, సూర్దాస్ అవగాహన కల్పించారు. సదస్సులో డాక్టర్లు హరీష్, గోపీనాథ్, ఆదిత్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనుల్లో జాప్యం తగదు

ఆదోని సెంట్రల్: ఇళ్ల నిర్మాణ పనుల్లో జాప్యం తగదని హౌసింగ్ డీఈ రవికుమార్ తెలిపారు. శుక్రవారం జగనన్న కాలనీలో జరుగుతున్న ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించ వలసిందిగా సూచించారు. ఇళ్ల నిర్మాణాల్లో మొదటి విడత కింద 5,101 ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. కాలనీలో 3,391 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్నాయన్నారు. 51 ఇళ్లు లెంటల్ లెవల్‌లో ఉండగా 38 ఇళ్లు రూఫ్ లెవల్‌లోను, 93 ఇళ్లకు టాప్ వేసినట్లు తెలిపారు. 1,528 ఇళ్లు ప్లింత్ బీమ్ లెవల్ ఉన్నట్లు పేర్కొన్నారు. వర్షాల వల్ల పనులకు ఆటంకం కలిగినట్లు తెలిపారు. దీనికి తోడు లేబర్ కొరత ఉందన్నారు. ఈసమస్యను పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి

ఆదోనిఅర్బన్: పేద బ్రాహ్మణ అర్చకుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా పనిచేస్తానని ఆంధ్రప్రదేశ్ ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు మధుసూదన్‌శర్మ తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ధూపదీప నైవేద్యాలు లేని ఆలయాలను ధూపదీప నైవేద్య స్కీమ్‌ను అమలుపరిచే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అమలు పరిచేందుకు కృషి చేస్తానన్నారు. చిన్నచిన్న దేవస్థానాల్లో పనిచేసే అర్చకులకు, చిన్నచిన్న ప్రయివేట్ ఉద్యోగాలు చేసుకునే బ్రాహ్మణులను గుర్తించి వారికి ఆరోగ్య కార్డులు, ప్రభుత్వ గృహాలు మంజూరు చేయించేదిశగా పనిచేస్తానన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

మంత్రాలయం రూరల్: రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు మంత్రాలయం వైష్ణవి, జీనియస్ గ్లోబల్ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల యాజమాన్యాలు శుక్రవారం తెలిపాయి. అండర్-14 స్పీడ్‌ప్రింటింగ్ విభాగంలో బి.ఉత్తమ కుమార్, డబల్ అండర్ ఈవెంట్‌లో ఎల్.కార్తీక్ గౌడ్‌లు ప్రథమ స్థానం నిలిచారు. ఈ లక్ష్మన్ గౌడ్ ఫ్రీస్టైల్ ఈవెంట్‌లో ప్రథమస్థానంలో నిలిచారు. అండర్-12 డబుల్ అండర్ విభాగంలో ఎస్.నరసింహనాయుడు ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ నెల 18న కర్నూలులో జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో పాఠశాల యాజమాన్యం కరస్పాండెంట్ గంగాధర్‌రెడ్డి, సతీష్‌చంద్ర,ట్రో రాఘవేంద్ర, అశ్విని, శృతి, ప్రధానోపాధ్యాయుడు యూనస్, వ్యాయమ ఉపాధ్యాయులు ఎస్.రాజేశ్, బి.ఈరన్న, వెంకటేశ్, నందకృష్ణ తదితరులు అభినందించారు.

రైతులపై వివక్ష తగదు



పరిపాలనాధికారి గోవింద్‌సింగ్‌తో చర్చిస్తున్న సీపీఐ నాయకులు

పెద్దకడబూరు: రైతులపై వివక్ష తగదదని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య అన్నారు. శుక్రవారం ఆదోనిలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గిడ్డయ్య మాట్లాడుతూ మండలంలోని కల్లుకుంట గ్రామంలో భూమిలేని నిరుపేద రైతులు 30 ఏళ్లుగా సాగుచేసుకుంటున్న సాగుభూమిని గతంలో పని చేసిన వీఆర్‌ఓ(మాజీ వీఆర్‌ఓ) మహబూబ్ పటేల్ నకిలీ పట్టాలు ఇచ్చారన్నారు. అప్పటి నుంచి బాధితుల పక్షాన సీపీఐ పోరాడుతున్నా తహసీల్దారు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి రైతులకు న్యాయం చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా రైతులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని పరిపాలనాధికారి గోవింద్‌సింగ్‌కు సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్ యాదవ్, లక్ష్మణ్, నాయక్‌జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

మన ఊరు-మన గుడి మన బాధ్యత

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో ఏకదాశి సందర్భంగా శనివారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమంలో భాగంగా గుడిని, పరిసర ప్రాంతాల్లో శుభ్రం చేసే కార్యక్రమం చేపట్టినట్లు మన ఊరు-మన గుడి-మనబాధ్యత నిర్వాహకులు వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రతి ఏకదాశికి హొక దేవస్థానాన్ని ఎంచుకుని కార్యక్రమం చేపడతామని, ఇందులో దాదాపు 100 కు పైగా భక్తులు పాల్గొంటారని వివరించారు. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం వరకు శుభ్రం చేసే పనిలో ఉంటామన్నారు.

శాంతియుత ర్యాలీని జయప్రదం చేయండి

పెద్దకడబూరు: మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలకు నిరసనగా ఈనెల 31న మండల కేంద్రంలో చేపట్టే శాంతియుత ర్యాలీని జయప్రదం చేయాలని ఎంసీపీసీ(మంత్రాలయం కాన్స్‌ట్యూయెన్సీ పాస్టర్స్ కమిటీ) మండల ఉపాధ్యక్షుడు స్వామిదాసు, కోశాధికారి జయపాల్ కోరారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు ర్యాలీకి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

వర్షం.. హర్షం

- చిగురించిన రైతుల ఆశలు
- అరకొర సాగైన పంటలకు జీవం పోసిన వర్షం
- ఆగస్టు 15 వరకు విత్తన సాగుకు అనుకూలం


వర్షం రాకతో కళకళలాడుతున్న పత్తి పైరు

ఆదోనిరూరల్: ఆలస్యంగా అయినా వరుణదేవుడు కరుణించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ జూన్ నెలలో ప్రారంభమైనా సకాలంలో వర్షాలు రాకపోవడంతో రైతులు దిగులు చెందారు. ఎట్టకేలకు వర్షం పడటంతో సాగులో నిమగ్నమయ్యారు. నియోజకవర్గంలో 33 ఎం.ఎం. వర్షపాతం నమోదైంది. దీంతో రైతులు విత్తనం వేసేందుకు ఉపక్రమించారు. ఇప్పటికే అక్కడక్కడా వేసిన విత్తనాలకు ఈ వర్షం జీవం పోసినట్లయ్యింది.

17,600 హెక్టార్లలో విత్తన సాగు

ఆదోని నియోజకవర్గంలో 30,258 హెక్టార్లలో ఖరీఫ్ సీజన్‌లో పంటలను సాగు చేయాల్సి ఉండగా, నెల ఆలస్యం కావడంతో ఇటీవల కురిసిన వర్షంతో నియోజకవర్గంలో ఇప్పటివరకు 17,600 హెక్టార్లలో రైతులు పత్తి, మిరప తదితర పంటలను సాగుచేశారు. పత్తి 15 వేల హెక్టార్లు, వేరుశనగ 1340 హెక్టార్లు, మిరప 650 హెక్టార్లు, ఉల్లి 200 హెక్టార్లు, ఆముదం 150 హెక్టార్లు, కంది 120 హెక్టార్లు, టమాటా 100 హెక్టార్లు, ఇతర కూరగాయల సాగు 70 హెక్టార్లు, ఆయా రకాల పూల సాగు 65 హెక్టార్లలో సాగైనట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

వర్షం పైరుకు జీవం పోసింది



నాకున్న 12 ఎకరాల పొలంలో పత్తి, మిరప విత్తనాలు వేశాను. ఇప్పటివరకు మొక్కలను కాపాడుకుంటూ వచ్చాను. వర్షం రాకపోయి ఉంటే మొక్కలు ఎండిపోయేవి. ఈ వాన మొక్కలకు జీవం పోసినట్లయ్యింది.

– ఉరుకుందప్ప, రైతు, పెద్దతుంబళం

నెల ముందే వర్షం వచ్చి ఉంటే బాగుండేది



జూన్‌లో అడపాదడపా పడిన వర్షాలకు నాకున్న మూడు ఎకరాల్లో వేరుశనగ సాగుచేశాను. మొలకలైతే వచ్చాయి. అనంతరం నెల రోజులకు పైగా వర్షాలు పడకపోవడంతో దిగాలు చెందాను. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఎండుదశలో ఉన్న వేరుశనగ మొక్కలు కాస్త పచ్చగా కనిపిస్తున్నాయి. – పుల్లయ్య, రైతు, పెద్దతుంబళం

నెలాఖరి వరకు విత్తనం వేయవచ్చు



ఈనెలాఖరి వరకు ఎర్రనేలలో పత్తి, వేరుశనగ పంటలను సాగుచేసుకునేందుకు అనుకూలంగా ఉంది. నల్లరేగడి పొలాల్లో ఆగస్టు 15వ తేదీ వరకు పత్తి, వేరుశనగ పంటలను వేసుకునేందుకు సమయం ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు భూమి పదును అయ్యింది. వేరుశనగ విత్తనాలు, జొన్నలు, మిరప, సజ్జలు, కొర్రలు, కందులు వంటి విత్తనాలను వచ్చే నెల 15వ తేదీ వరకు వేసుకునేందుకు అనుకూలంగా ఉంది. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండి నిలబడితే నార్మా యూరియాను చల్లి విత్తనం వేయవచ్చు. విత్తనాలు కుళ్లిపోకుండా మొలిచేందుకు అవకాశం ఉంటుంది.

– అశోక్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయాధికారి, ఆదోని మండలం